# సజావుగా పోలింగ్

- కరీంనగర్ నియోజకవర్గంలో 64.17 శాతం నమోదు
- చివరి రెండు గంటల్లోనే 11 శాతానికి మించి పోలింగ్


సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కార్పొరేషన్, నవంబర్ 30: కరీంనగర్ నియోజకవర్గంలో గురువారం పోలింగ్ సజావుగా ముగిసింది. నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్ నగర పాలక సంస్థతో పాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో ప్రశాంతంగా పోలింగ్ సాగింది. నియోజకవర్గంలో మొత్తం 64.17 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి మందకొడిగా మొదలైన పోలింగ్ మధ్యాహ్నం సమయానికి ఊపందుకుంది. పలు డివిజన్లలో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి కనిపించగా... పలు పోలింగ్ బూత్‌లలో ప్రజలు కనిపించలేదు. ఉదయం మొదటి రెండు గంటల్లో 6.13 శాతం పోలింగ్ నమోదు కాగా, ఉదయం 11 గంటలకు వరకు 14.6 శాతం పోలింగ్ జరిగింది. కాగా, మధ్యాహ్నం సమయంలో జోరుగా పోలింగ్ సాగడంతో 38.90 శాతం నమోదైంది. సాయంత్రం మూడు గంటల వరకు ఇదే స్థాయిలో పోలింగ్ సాగడంతో 53.71 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చివరి రెండు గంటల్లో సుమారు 11 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం. కరీంనగర్ నియోజకవర్గంలో 3.55 లక్షల మంది ఓటర్లు ఉండగా 64 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. నగరంలోని పలు పోలింగ్ బూత్‌లలో అరగంట నుంచి గంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. ఎన్నికల అధికారులు మరమ్మతులు చేసి వెంటనే పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. నగరంలోని 214వ పోలింగ్ బూత్‌లో 2 గంటల పాటు ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. 187, 388 పోలింగ్ బూత్‌లలో అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. రాంనగర్, కాపువాడ, కార్ఖానగడ్డ ప్రాంతాల్లోని పలు బూత్‌లలో లైటింగ్ సదుపాయాలు సరిగ్గా లేవన్న విషయంపై ఆయా పార్టీల నాయకులు ఎన్నికల అధికారులకు విన్నవించడంతో వెంటనే ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకర్షించాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పోషకాహార విలువలు తెలిసేలా ప్లకార్డులు, ఫొటోఫ్రేమ్‌లు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువత, దివ్యాంగుల విషయంలోనూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను అందిరినీ ఆకర్షించాయి. కాపువాడ, కార్ఖానగడ్డ, సుభాష్‌నగర్, అశోక్‌నగర్, సప్తగిరికాలనీ, తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి.


కొత్తపల్లి: పట్టణంలో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


కరీంనగర్‌లో ఓటు వేసేందుకు వృద్ధురాలిని వీల్‌చైర్‌పై తీసుకువస్తున్న సిబ్బంది

### ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

కరీంనగర్ నియోజకవర్గంలోని నగరపాలక సంస్థ పరిధిలో పలు పోలింగ్ బూత్‌లలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి ఓటు హక్కు వినియోగించుకున్నారు. క్రిస్టియన్ కాలనీలోని శ్రేయ వొకేషనల్ జూనియర్ కళాశాలలో గల 179వ పోలింగ్ బూత్‌లో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముకరంపురలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకోగా, భగత్‌నగర్‌లోని వివేకానంద పాఠశాలలో మేయర్ యాదగిరి సునీల్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాంనగర్‌లోని పోలింగ్ బూత్‌లో రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుర్మాచలం ఓటు వినియోగించుకున్నారు. రేకుర్తిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, రాంనగర్‌లోని వేదం స్కూల్ పోలింగ్ బూత్‌లో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి-హరిశంకర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ముకరంపుర, నవంబర్ 30: నగరంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి కేంద్రాల వద్ద బారులు తీరారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతతో పాటు వృద్ధులు ఉత్సాహంగా పోలింగ్ బూత్‌ల వద్దకు తరలివచ్చి ఓటు వేశారు. ఆరెపల్లి జడ్పీ పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పూలు, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు స్వాగతం పలికేలా కార్పెట్లు పరిచారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యార్థులు వలంటీర్లుగా సేవలందించారు. సెలవు దినం కావడం, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపడంతో కరీంనగర్‌లోని పలు ప్రధాన రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దే అప్రమత్తంగా ఉన్నారు.

### పోలింగ్‌ను పర్యవేక్షించిన సీపీ

రాంనగర్, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. దశల వారీగా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించేందుకు సమావేశాలు నిర్వహించి ముందస్తుగా తీసుకున్న చర్యలతో అందుబాటులో ఉన్న సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు నిర్వహించి పోలింగ్ ప్రశాంతంగా ముగిసేందుకు పోలీస్‌శాఖ తీవ్రంగా శ్రమించింది. ఎట్టకేలకు చెదురుముదురు సంఘటనలు మినహా జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. 5 గంటలకు పోలింగ్ ముగియడంతో ఈవీఎం బాక్స్‌లను అధికారులు సీజ్ చేసి జిల్లా కేంద్రానికి తరలించే వరకు పోలీసుల భద్రత కొనసాగింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి గురువారం ఉదయం నుంచి పోలింగ్ జరిగే ప్రాంతాలను ప్రతి నియోజకవర్గంలో స్వయంగా పర్యవేక్షించారు. ఉదయమే 8 గంటలకే నగరంలోని సమస్యాత్మక ప్రాంతమైన సప్తగిరికాలనీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పలు డివిజన్లలో పోలీసుల భద్రత తీరును పరిశీలించారు. అనంతరం చొప్పదండి నియోజకవర్గంలో సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అక్కడి నుంచి కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని దుర్శేడ్, బొమ్మకల్, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణం, వీణవంక, నర్సింగాపూర్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో పరిశీలించి భద్రతా వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 3వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొనగా, ఎప్పటిలాగే జిల్లాలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సీల్ చేసిన ఈవీఎంలను ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు తరలించే వరకు భద్రతా సిబ్బంది విధుల్లో ఉన్నారు. అనంతరం కౌంటింగ్ వరకు స్ట్రాంగ్ రూం వరకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు.


రాంనగర్‌లోని వేదం పాఠశాలలో క్యూలో నిల్చున్న ఓటర్లు


కరీంనగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో క్యూలో నిల్చున్న ఓటర్లు


దివ్యాంగురాలిని పోలింగ్ బూత్‌కు తరలిస్తుండడాన్ని పరిశీలిస్తున్న డీఈవో పమేలా సత్పతి

# జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 30: ఓటింగ్ శాతం నమోదు కోసం జిల్లా యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి కొనియాడారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్ సరళిని ఆమె పలు కేంద్రాలను సందర్శించి, స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివేకానంద పాఠశాలలోని 333, 334, స్వశక్తి కళాశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాలు 311, 312, 313, కేడీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన 144, 145, సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలోని 189, 190, 191 పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సమయంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కల్పించినందుకు ట్రాన్స్‌జెండర్లు కలెక్టర్‌కు, యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు స్వశక్తి కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఓటేసిన అనంతరం వీవీప్యాట్‌లో స్లిప్‌ను పరిశీలించుకోవాల్సిందిగా తెలియజేయాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత, మెప్మా పీడీ రవీందర్, డీడబ్ల్యూవో సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రాలు


ఆదర్శ పోలింగ్ కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన

- సెంటర్లలో పౌష్టికాహార ప్రదర్శనలు
- ఓటర్లను చైతన్యవంతం చేసేలా ముగ్గులు

కలెక్టరేట్, నవంబర్ 30: నగరంలో గురువారం ఏర్పాటు చేసిన ఆదర్శ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. పలు రకాల రంగులద్దిన బెలూన్లతో చేసిన అలంకరణ, ఓటర్లను చైతన్యపరిచేలా వివిధ కొటేషన్లతో రూపొందించిన ఫ్లెక్సీల ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది వేసిన ముగ్గులు, పౌష్టికాహార ప్రదర్శనలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లను ఆకర్షించాయి. నగరంలోని 26వ డివిజన్ పరిధిలో గల కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం హైలెట్‌గా నిలిచింది. అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారానికి అవసరమైన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ప్రదర్శనను ఓటర్లు ప్రత్యేకంగా వచ్చి తిలకించడం కనిపించింది. అలాగే, ఓటర్లను చైతన్యపరిచేలా ఎన్నికల సంఘం గుర్తు, చిన్నారులను ఎత్తుకుని ఉన్న ముగ్గులు ఓటర్లను ఆలోచింపజేశాయి.

### కర్ఫ్యూను తలపించిన నగరం

నగరవాసులంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్ఖానాలు, వ్యాపార సంస్థలకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించింది. దీంతో, అన్ని సంస్థలు గురువారం మూతపడ్డాయి. గ్రామాల్లో ఓట్లు ఉన్నవారంతా సొంతూళ్లకు వెళ్లగా, మిగతా వారు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఫలితంగా ఆయా కేంద్రాల్లో మాత్రమే సందడి నెలకొనగా, రహదారులు, ప్రధాన కూడళ్లన్నీ బోసిపోయాయి. కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది.

### ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్ల బారులు

నగరంలోని అనేక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7.30 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. కూలీ పనులకు వెళ్లే వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయేవారంతా పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే కేంద్రాలకు చేరుకున్నారు. వృద్ధులు, మహిళలు, యువత అత్యధిక సంఖ్యలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వరుస క్రమంలో నిల్చుని ఓటు వేయడం కనిపించింది. ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహించే వారితో పాటు అధిక సంఖ్యలో మహిళలు కూడా మధ్యాహ్నం అనంతరమే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పోలింగ్ కేంద్రాలన్నీ కిక్కిరిసిపోగా, మధ్యాహ్నం వేళలో పోలింగ్ మందకోడిగా సాగింది.